క్లుప్తంగా

బీజేపీతో కాంగ్రెస్ చీకటి ఒప్పందం

బీఆర్‌ఎస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి బాల్‌రాజు

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీజేపీతో చీకటి ఒప్పందం కుదుర్చుకుందని బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి బాల్‌రాజు అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు కోసం సీఎం రేవంత్‌రెడ్డి ములాఖత్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి తన సీఎం సీటును కాపాడుకునేందుకు ప్రధాని మోదీతో రహస్య ఒప్పందం కుర్చుకున్నారన్నారు. ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను గెలిపిస్తే తెలంగాణ ప్రజలకు నష్టమే తప్పా లాభం ఏమిలేదని విమర్శించారు. అధికారం చేపట్టిన వందరోజుల్లో హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, శ్రీకాంత్, అశోక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రచారంలో మాట్లాడుతున్న నాయకులు

కొత్తూరు: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు ఒకటేనని ప్రస్తుత ఎన్నికల్లో తమ ఉనికిని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నట్లు ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, విశాల, ఆగీరు రవికుమార్‌గుప్త, లింగంనాయక్, శంకర్‌నాయక్, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే రోజులు బీజేపీవే

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డికి కండువా కప్పుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల/మొయినాబాద్‌రూరల్: రాబోయే రోజులు బీజేపీవేనని బీజేపీ గ్రామస్థాయి నుంచి బలోపేతమైందని, చేవెళ్ల గడ్డపై ఈసారి బీజేపీదే విజయమని ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో శంకర్‌పల్లి మండలానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దండు సంతోష్, మున్సిపల్ ఉపాధ్యాక్షుడు దండు రామ్మోహన్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. అదేవిధంగా షాబాద్ మండలం మద్దూర్ చుట్టుపక్క గ్రామాల నుంచి ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు దాదాపు 200 మంది బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ కండువాలు ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, నక్కలపల్లి జంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో 65 పోలింగ్ స్టేషన్లు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్: లోక్‌సభ ఎన్నికలకు మండలంలో 65 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్‌లు ఏర్పాటు చేశారు. వారిని సులువుగా పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లేందుకు ర్యాంపులు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బాత్‌రూంలు, కరెంటు ఉండేలా ఏర్పాట్లు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పర్యటించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మొత్తం 61,048 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో రెండు గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. శ్రీరాంనగర్, హిమాయత్‌నగర్ గ్రామాల్లో ప్రత్యేక బలగాలను మోహరిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 120 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు.

కాసానికి మైనార్టీల మద్దతు



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

చేవెళ్ల: గత పదేళ్ల కాలంలో మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్‌ఎస్ పార్టీ చేసినంతగా ఏ పార్టీ చేయలేదని మైనార్టీ సంఘం నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఆర్ ఫాంహౌస్‌లో శనివారం నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని మైనార్టీ సంఘాల నాయకులందరూ విలేఖరుల సమావేశంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతు తెలుపుతున్నట్లుగా ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ వచ్చిన తరువాత మైనార్టీల కోసం అనేక పథకాలను తీసుకురావటంతో పాటు మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. మైనార్టీ నాయకుడు మహమూద్ అలీకి రెండు సార్లు ప్రభుత్వం మంత్రి పదవులను అప్పగించి కీలకంగా చూశారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మైనార్టీలకు చేసింది ఏమి లేదన్నారు. సమావేశంలో మైనార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ గని, జాఫర్, ఇక్రమొద్దీన్, ఉస్మాన్, రఫిక్, అరిఫ్, అస్లాం, సయ్యద్, ఇనాయత్, ఇమ్రాన్, తదితర మైనార్టీ నాయకులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబుయాదవ్, వెంకటేశ్, శివారెడ్డి, మహేశ్, చింటు, వెంకటేశ్, నర్సింలు తదితరులు ఉన్నారు.

రంజిత్‌రెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరు

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి చింపుల సత్యనారాయణరెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం పామెన గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ డి.గోపాల్‌రెడ్డి, గ్రామ నాయకుడు ఎర్ర గోపాల్‌ల ఆధ్వర్యంలో ఎంపీటీసీ సత్యనారాయణచారి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జి.యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ సరళవిజయ్‌కుమార్, యువకులు మల్లేశ్, మహేశ్, వినోద్, సాయి తదితరులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో సమక్షంలో చేరారు. మండలంలోని ఎర్రోనికోటల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బల్వంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మాజీ వార్డుసభ్యుడు ఎర్ర వెంకటస్వామి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా శంకర్‌పల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ పామెన భీంభరత్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలో గ్రామ అధ్యక్షుడు మాడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో చివరిరోజు ఎన్నికల ప్రచారం పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, డేవిడ్, మాణిక్యం, మిట్టు, నర్సింగ్‌రావు, జంగయ్య, అద్వానీ, రాజు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు



షాద్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక వాటర్ ఫ్రూఫ్ టెంటు

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని మినీస్టేడియంలో ఆదివారం ఉదయం నుంచి పోలింగ్ సిబ్బందికి అధికారులు సామగ్రి పంపిణీ చేయనున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా టెంట్లు వేసి, టేబుళ్లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,38,478 మంది ఓటర్లు ఉండగా మొత్తం 263 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు 1200 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. స్ట్రాంగ్‌రూంను ఆదివారం ఉదయం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో తెరిచి ఈవీయంలను పోలింగ్ సిబ్బందికి అప్పగించనున్నారు. పోలింగ్ సిబ్బంది గ్రామాలకు వెళ్లేందుకుగాను ఎన్నికల సంఘం వారు ప్రత్యేకంగా బస్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో పోలింగ్ సిబ్బందితో పాటుగా, స్పెషల్ ఫోర్స్‌ను నియమించారు. పోలీసులు గ్రామాలకు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాలను అధికారులు సిద్ధం చేశారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మినీ స్టేడియంలో ప్రత్యేక వాటర్ ప్రూఫ్ టెంటును అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

షాబాద్: ప్రతిపక్షాల మాటలు నమ్మకుండా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తా నుంచి షాబాద్, సర్దార్‌నగర్, హైతాబాద్, చందవనెల్లి మీదుగా నాగర్‌గూడ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, చెన్నయ్య, నర్సింహులు, మల్లేశ్, అశ్విణి, రవీందర్, వెంకట్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటు అమ్ముకోవద్దు

ధర్మసమాజ్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాఘవేందర్

షాబాద్: తమ ఓటును మద్యానికి, డబ్బులకు అమ్ముకోవద్దని, సేవచేసే నాయకులకు ఓటు వేయాలని ధర్మసమాజ్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాఘవేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కక్కులూర్ గ్రామంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చెప్పుల గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఓటుతోనే అక్రమార్కులకు సమాధానం చెప్పాలన్నారు. తమ పార్టీ పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, మల్లేశ్, కృష్ణ, లింగం, నర్సింహులు, నరేశ్, బాలు, చందు, నాని, నవీన్, శివ, శ్రీశైలం, ప్రవీణ్, రాజేశ్, తదితరులు ఉన్నారు.

మూడోసారి కేంద్రంలో బీజేపీదే అధికారం

జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా

షాద్‌నగర్: ముచ్చటగా మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా అన్నారు. మండల పరిధిలోని ఎలికట్ట, మహల్ ఎలికట్ట గ్రామాల్లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. దేశం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలంటే బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. ప్రజలందరూ బీజేపీకి అండగా నిలిచి మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, వెంకటేశ్, మదన్, శివకుమార్, రాము, శ్రీకాంత్, ప్రసాద్, జంగయ్య, శ్రీకాంత్, రాజు, అంజయ్య, మణికంఠ, శ్రీనాథ్, నందు, భువనేశ్, శ్రీనాథ్, మధు పాల్గొన్నారు.